## క్లుప్తంగా

### రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి



తొర్రూరు రూరల్: పంటలకు సరైన సాగునీరు అందక పంటలు ఎండి, నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ జనగామ జిల్లా అధ్యక్షుడు సౌడ రమేష్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లేగ రాంమోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని కంఠాయపాలెం, కస్నాతండ శివారులో ఎండిపోతున్న వరిపంటలను బీజేపీ నాయకులు పరిశీలించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పూసాల శ్రీమాన్, రంగు రాములు, కొలుపుల శంకర్, పల్లె కుమార్, రచ్చ కుమార్, నవీన్‌రెడ్డి, సురేష్, రాజేష్, అనిల్, సుధాకర్, నవీన్, విష్ణు, శివ పాల్గొన్నారు..

### భూగర్భ భౌతిక శాస్త్రవేత్తగా పదోన్నతి



కురవి: మహబూబాబాద్ జిల్లా కురవి మండలం కొత్తూరు(జీ) శివారు బంచరాయి తండా గ్రామానికి చెందిన బానోత్ బిచ్చునాయక్ సోమవారం రాత్రి ప్రధాన భూగర్భ భౌతిక శాస్త్రవేత్తగా పదోన్నతి వచ్చింది. మంగళవారం బిచ్చు నాయక్ మాట్లాడారు. బిచ్చునాయక్ ప్రస్తుతం రాజమండ్రిలోని (ఓఎన్‌జీసీలో సూపరింటెండెంట్ జియోఫిజిస్టు) భూ భౌతిక శాస్త్రవేత్తగా పనిచేస్తున్నారు.

### విజయవంతం చేయాలి

కురవి: ఈనెల 7వ తేదీన చేపట్టే చలో గిరిజన సంక్షేమ భవన్ ముట్టడిని జయప్రదం చేయాలని తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు మాలోత్ కిషన్ నాయక్ పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలో సంఘం సమావేశం నిర్వహించారు. పాత ట్రైకార్ రుణాలను ఎత్తివేస్తే తీవ్ర పరిణామాలుంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు దేవానాయక్, సీతారం నాయక్, రాము నాయక్, రాజు నాయక్ పాల్గొన్నారు.

### ఆలయానికి గ్రానైట్ వితరణ



కేసముద్రం: మున్సిపాలిటీ పరిధిలోని బ్రహ్మంగారి తండాలో నూతనంగా నిర్మిస్తున్న దుర్గమ్మ ఆలయానికి సమ్మిగౌడ్ ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ నాయకుడు చిలువేరు సమ్మయ్యగౌడ్ రూ.40వేల విలువైన గ్రానైట్‌ను మంగళవారం బహూకరించారు. ఈసందర్భంగా తండా వాసులు సమ్మయ్యగౌడ్‌ను సన్మానించారు. కార్యక్రమంలో బానోత్ భద్రు, బానోత్ వెంకన్న, భూక్య రవి, మోహన్ పాల్గొన్నారు.

### ఒకరికి జైలు

నెల్లికుదురు: దొంగతనం కేసులో ఒకరికి జైలు శిక్ష పడినట్లు ఎస్సై చిర్ర రమేష్ బాబు తెలిపారు. మంగళవారం విలేకరులతో ఎస్సై మాట్లాడుతూ.. 2024లో నెల్లికుదురు మండలం చిన్నముప్పారం గ్రామంలో కాలేరు సురేందర్ ఇంట్లో తొర్రూరు మండలం సోమారపు కుంట తండాకు చెందిన బానోతు నవీన్ దొంగతనం చేయగా కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కోర్టు కానిస్టేబుల్ వీరస్వామి కేసును నడిపించగా తొర్రూరు కోర్టులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ రేవతి దేవి వాదించి దొంగతనం చేసినట్లు రుజువు చేసినట్లు తెలిపారు. మెజిస్ట్రేట్ సరిత నేరస్తుడు బానోతు నవీన్‌కు 3 సంవత్సరాల జైలు శిక్షతోపాటు రూ.10వేల జరిమానా విధించినట్లు ఎస్సై తెలిపారు.

### మహిళలకు ప్రభుత్వం పెద్దపీట

మరిపెడ రూరల్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే మహిళలకు పెద్దపీట వేసిందని పార్టీ మహిళా నాయకులు నవిలే సావిత్రి, చింతోజు ధనమ్మ అన్నారు. ప్రభుత్వం చేపడుతున్న ప్రజాసంక్షేమ పథకాలపై హర్షం వ్యక్తం చేస్తూ మంగళవారం మండలంలోని ఉల్లెపల్లి గ్రామంలో సీఎం, డిప్యూటీ సీఎం, ఎమ్మెల్యే చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు బొద్దు వెంకన్న, లూనావత్ వెంకన్న, మద్దోజు వెంకన్న, శ్రీరంగం అవంతిక, ఉమ, రాధిక, లక్ష్మీ పాల్గొన్నారు.

### పాలాభిషేకం చేయాలి

డోర్నకల్: పేదలకు రేషన్ దుకాణాల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేస్తున్నందుకు సీఎం రేవంత్‌రెడ్డి ఫొటోకు పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు ప్రధాని మోదీ ఫొటోకు కూడా పాలాభిషేకం చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు బానోత్ గణేష్‌నాయక్ మంగళవారం తెలిపాడు.

### నవరాత్రి ఉత్సవాలు

గూడూరు: మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీ నారాయణస్వామి ఆలయంలో శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని మంగళవారం 3వ రోజు సీతారామ లక్ష్మణ ఆంజనేయస్వామి ఉత్సవ విగ్రహాలు నవరాత్రి పూజలందుకుంటున్నాయి.

# దారి మూసి‘వేతలు’

- అండర్ బ్రిడ్జి వెడల్పు పనులు ప్రారంభం
- త్వరగా పూర్తి చేయాలని కోరుతున్న తండావాసులు

డోర్నకల్: డోర్నకల్ మున్సిపాలిటీ పరిధిలోని సిగ్నల్ తండా వాసులు తండాకు దారి మూసివేయడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డోర్నకల్, ఖమ్మం రైలుమార్గంలో ప్రస్తుతం మూడోలైన్ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. పనుల్లో భాగంగా సిగ్నల్‌తండాకు వెళ్లే దారిలో రైలు పట్టాల కింద అండర్ బ్రిడ్జి వెడల్పు పనులు చేపట్టారు. ప్రస్తుతం రెండు లైన్ల కింద అండర్ బ్రిడ్జి ఉండగా మూడో లైన్ నిర్మాణం కోసం అండర్ బ్రిడ్జి వెడల్పు పెంచే పనులు చేపట్టారు.

**మూడు రైలుమార్గాల మధ్య సిగ్నల్‌తండా..**

డోర్నకల్–ఖమ్మం, డోర్నకల్–కొత్తగూడెం, కొత్తగూడెం–ఖమ్మం బైపాస్ రైలు మార్గాల మధ్య సిగ్నల్ తండా ఉంది. ఎస్సీ, బీసీ కాలనీలోని డోర్నకల్ లింగాల ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి సిగ్నల్‌తండాకు సుమారు 400మీటర్ల మేర రోడ్డు నిర్మించగా ఈ మార్గంలోని రైలు పట్టాల కింద అండర్ బ్రిడ్జి నిర్మించారు. మరోవైపు బైపాస్ లైను మార్గంలో అండర్ బ్రిడ్జి నిర్మించినా రోడ్డు సక్రమంగా లేకపోవడంతో రైతులు మాత్రమే బైపాస్ లైను అండర్ బ్రిడ్జి మీదుగా రాకపోకలు సాగిస్తున్నారు. ప్రస్తుతం అండర్ బ్రిడ్జి వెడల్పు పనులు చేపట్టడంతో ఎస్సీ, బీసీ కాలనీ, సిగ్నల్‌తండా రోడ్డును మూసివేయడంతో బైపాస్ లైను అండర్ బ్రిడ్జి మీదుగా రాకపోకలు సాగిస్తున్నారు. ఈ మార్గం మీదుగా ప్రయాణంతో తమ రెండున్నర కిలోమీటర్లకు పైగా దూరం పెరుగుతుందని తండావాసులు వాపోతున్నారు. తండావాసులు ప్రతీ రోజూ రెండు నుంచి మూడుసార్లు వివిధ పనులపై డోర్నకల్‌కు రాకపోకలు సాగిస్తున్నారు. బ్రిడ్జి వెడల్పు పనులతో ప్రయాణ దూరం పెరిగి ఇబ్బందులు ఎదురవుతున్నందున రైల్వే అధికారులు అండర్ బ్రిడ్జి వెడల్పు పనులు త్వరగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



మూసి వేసిన అండర్ బ్రిడ్జి దారి

# ఆస్పత్రి నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

తొర్రూరు: డివిజన్ కేంద్రంలోనే అన్నివర్గాల ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా వంద పడకల ఆస్పత్రిని ఏర్పాటు చేసేందుకు కృషి చేయాలని కోరుతూ పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డికి వామపక్ష పార్టీల నాయకులు వినతిపత్రాన్ని మంగళవారం అందించారు. ఈసందర్భంగా సీపీఐ, సీపీఎం, న్యూడెమోక్రసీ, మాస్‌లైన్ పార్టీల నాయకులు తమ్మెర విశేశ్వర్‌రావు, బొల్లం అశోక్, ముంజంపెల్లి వీరన్న, ఊడుగుల లింగయ్య మాట్లాడారు. వందపడకల ఆస్పత్రి నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలని, జాతీయ రహదారికి ఇరువైపుల డ్రెయినేజీ నిర్మాణాన్ని పూర్తి చేయాలని, కరెంట్ స్తంభాలను తొలగించి సరిచేయాలని, మినీ ట్యాంక్ బండ్, తదితర సమస్యలపై విన్నవించారు. కార్యక్రమంలో నాయకులు ఎండీ యాకుబ్, బందు మహేందర్, దర్గయ్య, ఎల్లయ్య, వెంకటేశ్వర్లు, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

# విద్యార్థుల అక్రమ అరెస్టులు సరికాదు

- పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు మధు



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

మహబూబాబాద్ అర్బన్: హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయ విద్యార్థులపై లాఠీచార్జ్‌లు, భూములను లాక్కోవడాన్ని, విద్యార్థులపై పోలీసులు వ్యవహరించిన తీరును అక్రమ అరెస్టులను ఖండిస్తున్నామని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు బోనగిరి మధు అన్నారు. జిల్లా కేంద్రంలోని నూకల రామచంద్రారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదుట మంగళవారం పీడీఎస్‌యూ నాయకులు ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మాదారపు నాగరాజు, జిల్లా నాయకులు మహేష్, ఆసిఫ్, ప్రణయ్, నవీన్, తదితరులు పాల్గొన్నారు. డీఎస్ఎఫ్ఐ నాయకులు జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో నిరసన తెలిపి ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కేలోతు సాయికుమార్, గుగులోతు సూర్యప్రకాశ్, సురభి పాల్గొన్నారు. పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి బానోత్ దేవేందర్ సెంట్రల్ యూనివర్సిటీ భూములను ప్రభుత్వ తీసుకోవడం మానుకోవాలని డిమాండ్ చేశారు.

## పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

నెహ్రూసెంటర్: పోరాటాలతోనే భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కారం అవుతాయని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి రేషపల్లి నవీన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని వీరభవన్‌లో ఏఐటీయూసీ అనుబంధ సంఘాల సమావేశం బూర్గుల శ్రీను అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఈ సమావేశంలో నాయకులు శంకర్, జానీ, పాష, యాకయ్య, రమణ, బాబు, తదితరులు పాల్గొన్నారు.

# తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి

- ఎమ్మెల్యే మురళీనాయక్



బావిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్

గూడూరు: మండల కేంద్రంతోపాటు గ్రామాల్లో వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే మురళీనాయక్ ఆదేశించారు. గూడూరు శివారు బొమ్మాయికుంట వద్ద గల నల్లాల బావిని మంగళవారం ఎమ్మెల్యే మిషన్ భగీరథ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా పట్టణంలో మిషన్ భగీరథ పైపులైన్ ద్వారా రోజు విడిచి రోజు నీరు సరఫరా అవుతుందని, ఇబ్బంది కల్గుతుందని పలువురు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. దీంతో వెంటనే నల్లాల బావిని ఎమ్మెల్యే పరిశీలించారు. బావికి వెంటనే 10హెచ్‌పీ మోటార్ అమర్చి నిత్యం ట్యాంకులకు నీరు సరఫరా అయ్యేలా చూడాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాస్, ఏఈ దినేష్‌లను ఆదేశించారు. కార్యక్రమంలో నాయకులు ప్రదీప్‌రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాయకులు నరేష్‌రెడ్డి, శ్రీపాల్‌రెడ్డి, కొమ్మాలునాయక్, సురేందర్, ఎస్సై గిరిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

# వేలాన్ని ఉపసంహరించుకోవాలి



మహబూబాబాద్ రూరల్: అరెస్టయిన నాయకులు

మహబూబాబాద్ రూరల్: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల వేలంపాటను ఉపసంహరించుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఆకుల రాజు డిమాండ్ చేశారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ స్థలాన్ని అక్రమంగా ఆక్రమించుకుని అమ్మడానికి నిరసిస్తూ యూనివర్సిటీ గేటు ఎదుట జరుగనున్న నిరసన ధర్నాకు వెళ్తున్న సీపీఎం నాయకులను మంగళవారం ముందస్తుగా అరెస్టు చేసి మహబూబాబాద్ పోలీస్‌స్టేషన్ తరలించారు. అరెస్టు అయిన వారిలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు సమ్మెట రాజమౌళి, పట్టణ కార్యదర్శి బానోతు సీతారాం, రావుల రాజు, చిపిరి యాకయ్య, హేమనాయక్, బానోతు సింహాద్రి ఉన్నారు.

గూడూరు/గార్ల/నెల్లికుదురు/బయ్యారం/మరిపెడ రూరల్: సెంట్రల్ యూనివర్సిటీ భూముల అమ్మకాన్ని వ్యతిరేకిస్తూ చలో హైదరాబాద్‌కు వెళ్తున్న ప్రతిపక్ష పార్టీల నాయకులను మంగళవారం పోలీసులు ముందుస్తు అరెస్ట్ చేశారు. అరెస్ట్ అయిన వారిలో నాయకులు కందునూరి శ్రీనివాసరావు, అలువాల సత్యవతి, మహేష్‌కుమార్, లోకేష్, ఇస్సంపల్లి సైదులు, పెరుమాండ్ల బాబు, మండా రాజన్న, అంగిరేకుల నాగేశ్వరరావు, వెంకన్న, గుండగాని మధుసూదన్, ఎండీ అబ్దుల్, తదితరులు ఉన్నారు.

# పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**సన్నబియ్యం పంపిణీ ప్రారంభించిన ఎమ్మెల్యేలు**

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం జిల్లా వ్యాప్తంగా పలు గ్రామాల్లో ఎమ్మెల్యేలు, తహసీల్దార్లు, నాయకులు ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యేలు మురళీనాయక్, యశస్వినిరెడ్డి, కోరం కనకయ్య మాట్లాడుతూ.. పేదల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పాటుపడుతుందన్నారు. సామాన్య ప్రజలకు ఆర్థికభారం తగ్గించడం కోసం ప్రభుత్వం ఇలాంటి ప్రతిష్టాత్మక పథకం ప్రవేశపెట్టిందన్నారు. ప్రజలు సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



కేసముద్రం: కోరుకొండపల్లిలో సన్న బియ్యం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్



గార్ల: ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య



మహబూబాబాద్ రూరల్: రెడ్యాల గ్రామంలో పంపిణీ చేస్తున్న వెన్నం శ్రీకాంత్ రెడ్డి



పెద్దవంగర: చిన్నవంగరలో సన్న బియ్యం పంపిణీ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



డోర్నకల్: ప్రారంభిస్తున్న తహసీల్దార్ కృష్ణవేణి



కురవి: ప్రారంభిస్తున్న తహసీల్దార్ సునీల్‌రెడ్డి



మరిపెడ రూరల్: ఉల్లెపల్లిలో..

# చేనేత కార్మికులను ఆదుకోవాలి



చేనేత మగ్గం పరిశీలిస్తున్న వీరయ్య

మరిపెడ రూరల్: చేనేత కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు అల్వాల వీరయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. మంగళవారం మండలంలోని అబ్బాయిపాలెం గ్రామంలో చేనేత కార్మికుడు దుస్స బాబు మగ్గాన్ని ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా వీరయ్య మాట్లాడుతూ.. మండలంలోని అబ్బాయిపాలెం తోపాటు గుండెపుడి, బావోజీగూడెం తదితర గ్రామాల్లో చేనేత కుటుంబాలు కలిగి ఉన్నాయన్నారు. కొంతకాలంగా చేతి వృత్తుల డిమాండ్ పడిపోవడంతో చేనేత కార్మికులు జీవనోపాధి పూర్తిగా కోల్పోయారని అన్నారు. అర్హులైన చేనేత కార్మికులకు బ్యాంకు రుణాలు కల్పించి వారి కుటుంబానికి ఆసరాగా నిలవాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో నాయకులు మధుసూదన్, రాజన్న, ఉప్పలయ్య, లచ్చయ్య, వెంకన్న పాల్గొన్నారు.

# గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్ దాడులు



దాడులు నిర్వహిస్తున్న ఎక్సైజ్ పోలీసులు

గార్ల: మండలంలోని పలు గ్రామాల్లో కాపుసారా స్థావరాలపై ఎక్సైజ్ పోలీసుల ఆధ్వర్యంలో ముమ్మరంగా దాడులు నిర్వహించి, కాపుసారా కాస్తున్న 9మందిపై కేసులు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ చిరంజీవి తెలిపారు. మండలంలోని మర్రిగూడెం, తిర్లాపురం, బుద్దారం, గార్ల గ్రామాల్లో జిల్లా ఎక్సైజ్ పోలీసులు, వరంగల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు కాపుసారా స్థావరాలపై సంయుక్తంగా దాడులు నిర్వహించారు. దాడుల్లో 800 లీటర్ల బెల్లం పానకం, 32 లీటర్ల కాపుసారాను స్వాధీనం చేసుకొని ధ్వంసం చేసి, 9మందిపై కేసు నమోదో చేసినట్లు పేర్కొన్నారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్సైలు చంద్రశేఖర్, అశోక్, కిరిటీ, హెడ్‌కానిస్టేబుళ్లు మధు, శ్రీనివాస్, యాదగిరి, అశ్విని, శేఖర్, వెంకన్న, నర్సింగరావు పాల్గొన్నారు.

### జయప్రదం చేయండి

నెహ్రూసెంటర్: కేంద్రంలోని మోదీ సర్కార్ అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై ఈనెల 8న దేశవ్యాప్త నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి పాయం చిన్న చంద్రన్న పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ప్రజలు, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కొత్తపల్లి రవి, వీరన్న, బిల్లకంటి సూర్యం, పైండ్ల యాకయ్య, తదితరులు పాల్గొన్నారు.

### ప్రైవేట్ కంపెనీలకు అప్పగించొద్దు

నెహ్రూసెంటర్: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమాన్ని ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పగించడాన్ని తిప్పికొట్టాలని, సంక్షేమబోర్డు కమిటీలో కార్మిక సంఘాలకు ప్రాతినిధ్యం కల్పించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఐ.కృష్ణ డిమాండ్ చేశారు. రెండు ఐఎఫ్‌టీయూ సంఘాల రాష్ట్ర విలీన సభను మంగళవారం భట్టు అంజయ్యభవన్‌లో నిర్వహించారు. పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించిన అనంతరం సభను ఏర్పాటు చేశారు. ఈ సభలో శివ్వారపు శ్రీధర్, హెచ్.లింగన్న, గౌని నాగేశ్వర్‌రావు, పర్వత కోటేష్, ఎండీ.జబ్బార్, నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

### ఇసుక ట్రాక్టర్ల సీజ్

నెల్లికుదురు: అక్రమంగా తరలిస్తున్న 8ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తహసీల్దార్ కోడిచింతల రాజు తెలిపారు. మంగళవారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మునిగలవీడు గ్రామ శివారులోని ఆకేరు వాగులోంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం వచ్చిందన్నారు. రెవెన్యూ కార్యాలయ అధికారులు, సిబ్బందితో కలిసి వెళ్లి ఇసుక లోడు చేస్తున్న 8ట్రాక్టర్లను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించి యజమానులపై కేసు నమోదు చేసినట్లు తహసీల్దార్ తెలిపారు.

### ఉరేసుకుని మహిళ ఆత్మహత్య

డోర్నకల్: మండలంలోని కన్నెగుండ్ల గ్రామానికి చెందిన ఓ మహిళ ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. డోర్నకల్ ఏఎస్సై కోటేశ్వర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. కన్నెగుండ్లకు చెందిన నిమ్మల రాధ(38) అనారోగ్య సమస్యలతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలికి భర్త కోటేశ్వర్‌రావు తోపాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై పేర్కొన్నారు.

## సంక్షిప్త సమాచారం

**నల్లబ్యాడ్జీలతో నిరసన**

మహబూబాబాద్ అర్బన్/మహబూబాబాద్: యూపీఎస్ అమలును వ్యతిరేకిస్తూ టీఎస్ సీపీఎస్ఈయూ జిల్లా నాయకులు నల్లబ్యాడ్జీలు ధరించి జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో మంగళవారం నిరసన తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి రవి, గొపూ లక్ష్మికాంత్, ఆహ్మద్, శ్రీకాంత్‌నాయక్, వీరన్న, రవీందర్, రఫీ, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

**జయప్రదం చేయండి**

బయ్యారం: ఈనెల 5న నారాయణపేటలో నిర్వహించనున్న తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర రెండో మహాసభను జయప్రదం చేయాలని టీయూసీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి బిల్లకంటి సూర్యం పిలుపునిచ్చారు. మంగళవారం బయ్యారంలో మహాసభ పోస్టర్లను ఆవిష్కరించారు.

**సన్నబియ్యం ఇచ్చేది కేంద్ర ప్రభుత్వమే**

గార్ల: బీజేపీ నాయకుల అక్రమ అరెస్టులను ప్రజాస్వామిక వాదులు తీవ్రంగా ఖండించాలని బీజేపీ మండల అధ్యక్షుడు శివకృష్ణ పేర్కొన్నాడు. మంగళవారం గార్లలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో సన్న బియ్యం ఇచ్చేది కేంద్ర ప్రభుత్వమే అని, దీన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తున్నట్లు ప్రచారం చేసుకుంటుందన్నారు.

**మొరం తరలింపును అడ్డుకున్న అధికారులు**

కొత్తగూడ: మండలంలోని మైలారం గ్రామ సమీపంలో అనుమతులు లేకుండా చేస్తున్న మొరం దందాను రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. తహసీల్దార్ రమాదేవి తెలిపిన వివరాల ప్రకారం.. రెవెన్యూ భూమిలో మొరం తీసి విక్రయిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు ఆర్ఐని పంపించి నిలిపివేసినట్లు తెలిపారు. అనుమతులు లేకుండా మొరం దందా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**మానవ మనుగడకు మొక్కలే ఆధారం**

గూడూరు: మానవ మనుగడకు మొక్కలే ఆధారమని, ప్రతీ ఒక్కరు పచ్చని చెట్లను పెంచాలని ఎమ్మెల్యే మురళీనాయక్ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం బియ్యం పంపిణీకి విచ్చేసిన ఎమ్మెల్యేతో వన ప్రేమికుడు నల్లగొండ సమ్మయ్య రావిచెట్టును నాటించారు.

**ఆర్థికసాయం**

నెల్లికుదురు: మండలంలోని మేచరాజుపల్లి గ్రామ పంచాయతీ సిబ్బందిగా పనిచేస్తు గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన పారిశుద్ధ్య కార్మికుడు ఎల్తూరి ముత్తయ్య (58) కుటుంబానికి గ్రామ పంచాయతీ నుంచి రూ.10వేల ఆర్థికసాయం అందించినట్లు గ్రామ ప్రత్యేక అధికారి మంగతాయి మంగళవారం తెలిపారు.

**ఉపసంహరించుకోవాలి**

నెహ్రూసెంటర్: రాష్ట్ర వ్యాప్తంగా పెంచిన టోల్ చార్జీలను వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి మంగళవారం డిమాండ్ చేశాడు.

**క్షీరాభిషేకం**

కురవి/డోర్నకల్: అర్హులైన నిరుపేద కుటుంబాలకు ఉచితంగా సన్న బియ్యం పంపిణీ చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే రాంచంద్రునాయక్‌ల చిత్రపటాలకు కాంగ్రెస్ నాయకులు మంగళవారం పాలాభిషేకం చేశారు. ఈసందర్భంగా మహబూబాబాద్ మార్కెట్ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్, వి.హర్షవర్ధన్‌రెడ్డి మాట్లాడారు.

**నగదు పురస్కారం అందజేత**

కురవి: మండల కేంద్రంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల/కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు హర్షిత, పూజిత ఇంటర్మీడియట్‌లో అత్యధిక మార్కులు సాధించడంతో, ప్రతిభను గుర్తించిన మినిస్ట్రీ ఆఫ్ ట్రైబల్ అఫైర్స్ సెక్రటరీ చేతుల మీదుగా మంగళవారం ఢిల్లీలో రూ.50వేల చొప్పున నగదు పురస్కారం అందించినట్లు ప్రిన్సిపాల్ బి.లాలు తెలిపారు.

**ఉపాధి కోల్పోతున్న పెయింటర్స్**

కేసముద్రం: వలస కార్మికుల ద్వారా స్థానిక పెయింటర్స్ తమ ఉపాధిని కోల్పోతున్నారని ఏఐటీయూసీ మండల కార్యదర్శి మంద భాస్కర్ అన్నారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని ఏఐటీయుసీ అనుబంధ మిత్ర పెయింటింగ్ వర్కర్స్ యూనియన్ సమావేశం నిర్వహించారు వేల్పుగొండ ఏలియా, లింగాల శ్రీను, యాకస్వామి, భాస్కర్, కుమార్, వీరస్వామి, తదితరులు పాల్గొన్నారు.

**సోషల్ మీడియా కన్వీనర్‌గా రణధీర్‌రెడ్డి**



గూడూరు: గూడూరు మండలం సీతానగరం గ్రామానికి చెందిన డాక్టర్ రాగిడి రణధీర్‌రెడ్డిని రెడ్డి కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీ నేషనల్ సోషల్ మీడియా కన్వీనర్‌గా నియమిస్తూ మంగళవారం సంస్థ నేషనల్ కన్వీనర్ వల్లపు వెంగల్‌రెడ్డి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు యర్రపురెడ్డి సురేంద్రరెడ్డి పత్రాన్ని అందించారు.

**ఘన నివాళి**

గార్ల: పేద, బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, గార్లలో సీపీఎం ఫౌండర్ ఐతపు మంగపతిరావు ఆశయాల సాధన కోసం ఉద్యమించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కందునూరి శ్రీనివాసరావు అన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో మంగపతిరావు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఈశ్వర్‌లింగం, గోవింద్, పెద్దవెంకటేశ్వర్లు, రామకృష్ణ, లోకేశ్వరరావ పాల్గొన్నారు.

## బావిలో పురుగుల మందు కలిపాడంటూ ప్రచారం..

కేసముద్రం: మున్సిపాలిటీ పరిధిలోని కేసముద్రంవిలేజ్ శివారు ఎన్టీఆర్‌నగర్ సమీపంలో గల మంచినీటి బావిలో ఓ వ్యక్తి సోమవారం సాయంత్రం పురుగుల మందు కలిపాడంటూ ప్రచారం కావడంతో స్థానికంగా కలకలం రేపింది. వివరాలు ఇలా ఉన్నాయి.. ఎన్టీఆర్ నగర్ సమీపంలో గల మంచినీటి బావిలో ఓ వ్యక్తి పురుగుల మందు కలుపుతుండగా చూశానంటూ ఓ మహిళ అధికారులకు తెలిపింది. దీంతో అప్రమత్తమైన అధికారులు మంగళవారం మంచినీటి సరఫరాను నిలిపివేశారు. సదరు వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకుని బావి వద్దకు తీసుకెళ్లారు. తాను పురుగుల మందు బావిలో కలపలేదని, కొంత దూరంలో పడేశానని చెప్పుకొచ్చాడు. ఏదిఏమైనా ముందస్తు జాగ్రత్తగా మున్సిపల్ అధికారులు మంచినీటి బావిలోని నీటిని మోటార్ల ద్వారా తోడించి, బ్లీచింగ్ పౌడర్ చల్లించారు.

## కారు ఢీకొని మహిళా కూలీ మృతి

మద్దిరాల: కారు ఢీకొని మహిళా కూలీ మృతి చెందిన సంఘటన సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలం కుంటపల్లి గ్రామంలో సూర్యాపేట–దంతాలపల్లి ప్రధాన రహదారిపై మంగళవారం జరిగింది. ఏఎస్సై మల్లయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలం పెద్దముప్పారం గ్రామానికి చెందిన అలువాల స్వరాజ్యం(58) మంగళవారం సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలం కుంటపల్లి గ్రామంలో ఓ రైతు మిర్చి తోటలో మిర్చి ఏరడానికి బయలు దేరింది. ఆటోలో కూలీలు ఎక్కువ కావడంతో సదరు రైతు ద్విచక్రవాహనంపై స్వరాజ్యంతోపాటు మరో మహిళను తీసుకెళ్లాడు. కుంటపల్లిలో బైక్ దిగిన స్వరాజ్యం ఆటో వద్దకు వెళ్లి తోటి కూలీలతో మాట్లాడుతుండగా.. సూర్యాపేట–దంతాలపల్లి ప్రధాన రహదారిపై మద్దిరాల నుంచి దంతాలపల్లి వైపు వెళ్తున్న కారు ఆమెను ఢీకొట్టింది. ఈప్రమాదంలో స్వరాజ్యం అక్కడికక్కడే మృతిచెందింది. మృతురాలి చిన్న కుమార్తె ధర్మారపు రేణుక ఇచ్చిన ఫిర్యాదు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తుంగతుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఏఎస్సై తెలిపారు.